మహదేవపూర్ : ధాన్యంపై టార్పాలిన్లు కప్పిన రైతులు

గణపురం : నగరంపల్లిలో దెబ్బతిన్న మిర్చితోట

మహాముత్తారం : ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఏవో

వణుకు పుట్టిస్తున్న వర్షం

- జయశంకర్ జిల్లాలో తుఫాన్ ప్రభావం
- రెండు రోజులుగా కురుస్తున్న వాన
- వరి, పత్తి పంటల్లో చేరుతున్న నీరు
- ఆందోళన చెందుతున్న రైతులు
- ఈదురుగాలులతో తగ్గిన ఉష్ణోగ్రతలు
- చలికి ఇళ్ల నుంచి బయటకు రాని ప్రజలు

కృష్ణకాలనీ, డిసెంబర్ 6 : మిగ్‌జాం తుఫాన్ ప్రభావంతో జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో రెండు రోజులుగా ఏకధాటిగా వర్షం కురుస్తున్నది. దీంతో ఆయా మండలాల్లోని వరి, పత్తి పంటల్లోకి నీరు చేరి నష్టం వాటిళ్లుతున్నది. బుధవారం రోజంతా వర్షం పడడంతో పగటి ఉష్ణోగ్రతలు 20 డిగ్రీలకు పడిపోయాయి. వర్షానికి తోడు ఈదురు గాలులు వీస్తుండడంతో చలి తీవ్రత పెరిగింది. దీంతో ప్రజలు రెండు రోజులుగా బయటకు రాకుండా ఇండ్లకే పరిమితమయ్యారు.

మహదేవపూర్‌లో..

మహదేవపూర్ : మండల కేంద్రంతో పాటు ఎడపల్లి, కుదురుపల్లి, ఎల్కేశ్వరం, బెగ్లూర్, పెద్దంపేట, ఎన్కపల్లి, బొమ్మాపూర్, బ్రాహ్మణపల్లి, సూరారం, అంబట్‌పల్లి, రాపల్లికోట గ్రామాల్లో తుఫాన్ ప్రభావంతో బుధవారం ఎడతెరపిలేకుండా వర్షం కురిసింది. ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఆరబోసిన ధాన్యం వర్షానికి తడవకుండా రైతులు టార్పాలిన్ కవర్లు కప్పారు. వాన తీవ్రత పెరిగితే కల్లాల్లోని ధాన్యం తడిసి నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని రైతెలు ఆందోళన చెందుతున్నారు.

గణపురంలో..

గణపురం : తుఫాన్ ప్రభావంతో రెండు రోజులుగా ఈదురు గాలులతో కూడిన వర్షం కురుస్తున్నది. మండల వ్యాప్తంగా ఆయా గ్రామాల్లో బుధవారం పొద్దంతా చల్లని గాలులు వీస్తూ, వాతావరణమంతా చల్లబడి ఎడతెరిపి లేకుండా వాన కురిసింది. దీంతో మండలంలోని ఆయా గ్రామాల్లో ప్రజలు వ్యవసాయ పనులకు పోకుండా ఇండ్లకే పరిమితమయ్యారు. అలాగే ఆయా గ్రామాల్లో వరి, మిరప తోటలు, పత్తి చేలలోకి నీరు చేరి కొంతమేర పంటలు దెబ్బతిని రైతులకు నష్ట వాటిల్లింది.

కొనుగోలు కేంద్రం పరిశీలన

మహాముత్తారం : తుఫాన్ ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు రైతుల ధాన్యం తడువకుండా జాగ్రత్తలు తీసుకోవాలని మండల వ్యవసాయ అధికారి కల్వల సతీశ్‌కుమార్ సూచించారు. మండలంలోని స్తంభంపల్లి పీపీ గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. ఒక వేళ ధాన్యం తడిస్తే ఐదు శాతం ఉప్పు ద్రావణాన్ని పిచికారీ చేయాలన్నారు. దీనివల్ల వడ్లు మొలకెత్తవని పేర్కొన్నారు.

కాటారంలో..

కాటారం : తుఫాను ప్రభావంతో బుధవారం మండలంలో కురిసిన అకాల వర్షంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఆరుగాలం శ్రమించి పండించిన పంట చేతికందిన సమయంలో వర్షం కురవడంతో నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని దేవరాంపల్లి, గంగారం, విలాసాగర్, దామెరకుంట గ్రామాల్లో కోతకొచ్చిన వరి పంట నేలవాలింది. మండలంలోని పలు గ్రామాల్లోని కల్లాల్లో ఆరబోసిన ధాన్యం వర్షంతో తడిసి ముద్దయ్యింది.

టేకుమట్లలో..

టేకుమట్ల : తుఫాన్ ప్రభావంతో మంగళవారం నుంచి కురుస్తున్న వాన బుధవారం కొనసాగింది. దీంతో పంట చేతికొచ్చిన తరుణంలో ఆరబోసిన ధాన్యం తడుస్తున్నదని, పత్తి, మిర్చి పంటలకు నష్టం కలుగుతున్నదని రైతులు ఆందోళన చెందుతున్నారు. ధాన్యం తడువకుండా పరదాలు కప్పి కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నారు.

టేకుమట్ల : ధాన్యం కుప్పలపై కవర్లు కప్పిన రైతులు

శివాలయంలో అయ్యప్ప మహా పడిపూజ

అయ్యప్ప పడి పూజ చేస్తున్న భక్తులు

మహదేవపూర్, డిసెంబర్ 6 : మండల కేంద్రంలోని శివాలయంలో బుధవారం గురుస్వామి గుడాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో హరిహరసుత అయ్యప్ప మహా పడిపూజ నిర్వహించారు. పదునెట్టాంబడి పూజ చేశారు. కార్యక్రమానికి అధిక సంఖ్యలో అయ్యప్ప దీక్షాపరులు, భక్తులు, మహిళలు తరలివచ్చారు. స్వామి వారి నామస్మరణతో ఆలయ పరిసరాలు మార్మోగాయి. కార్యక్రమంలో జడ్పీటీసీ గుడాల అరుణ, గురు స్వాములు సిరిపురం సుధాకర్, భరత్, అన్నం బాలయ్య, పడకంటి రమేశ్, గోరంటల రాజు, అడప నందకిశోర్ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ మోసాలపై అవగాహన

మహదేవపూర్, డిసెంబర్ 6 : మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు ఎస్సై భవానీ సేన్ ఆదేశాల మేరకు బుధవారం సైబర్ మోసాలపై పోలీసులు కిషన్, దనుంజయ్ అవగాహన కల్పించారు. గుర్తు తెలియని వ్యక్తులకు ఆధార్, బ్యాంక్, ఇతర వ్యక్తిగత వివరాలను చెప్పకూడదన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ చంద్రపల్కల ప్రసాద్, సదాశివ్, రమేశ్, పిన్నయ్య, పోచయ్య, సదానందం, సరిత పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఏరియా అధికార ప్రతినిధి అజ్మీరా తుకారాం

ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి

- సింగరేణి ఏరియా అధికార ప్రతినిధి అజ్మీరా తుకారాం

భూపాలపల్లి రూరల్, డిసెంబర్ 6 : సింగరేణి ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని భూపాలపల్లి ఏరియా అధికార ప్రతినిధి అజ్మీరా తుకారాం అన్నారు. బుధవారం జీఎం కార్యాలయంలో సింగరేణి సేవా సమితి సెక్రటరీ, సభ్యులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సింగరేణి సేవా సమితి మహిళలకు ఆటల పోటీలు, డ్యాన్స్ ప్రోగ్రాంలు నిర్వహించాలని, స్టాల్స్ ఏర్పాటు చేయాలన్నారు. ఎలాంటి అటంకాలు, ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేసి, విజయవంతంగా నిర్వహించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో డీవైపీఎంబి శ్యాం ప్రసాద్, కోఆర్డినేటర్ ప్రవీణ్, సెక్రటరీ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల వివరాలు నమోదు చేయాలి

గణపురం, డిసెంబర్ 6 : మండలంలోని ఆయా ప్రభుత్వ పాఠశాలలల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థుల వివరాలను ప్రతి రోజూ అన్‌లైన్‌లో నమోదు చేయాలని ఎంఈవో రఘుపతి తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్‌లో మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో యూడైస్ ప్లస్‌పై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని ప్రతి పాఠశాలలోని వసతులు, విద్యార్థుల, ఉపాధ్యాయుల వివరాలను తప్పులు లేకుండా యూడైస్‌లో నమోదు చేయాలని ఎంఈవో ఆదేశించారు. కార్యక్రమంలో ఊరుగొండ ఉప్పలయ్య, అశోక్, దేసు సతీశ్ కుమార్, అక్బర్, సతీశ్, రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంఈవో రఘుపతి

బుగులోని ఆదాయం రూ.4.55 లక్షలు

రేగొండ, డిసెంబర్ 6 : మండలంలోని తిరుమలగిరి శివారులోని శ్రీబుగులోని వేంకటేశ్వరస్వామి జాతర హుండీలను బుధవారం లెక్కించినట్లు జాతర నిర్వాహకులు తెలిపారు. జాతర సమీపంలోని రైతు వేదికలో నిర్వహించిన లెక్కింపులో ఆదాయం రూ. 4,55,825 వచ్చినట్లు పరిశీలకులు డీ అనిల్‌కుమార్, ఏవో వాసుదేవరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఈవో శ్రీనివాస్, మాజీ ఆలయ చైర్మన్ కడారి జనార్దన్, ఎంపీటీసీ గంట గోపాల్, కట్ల రాణీ మధుసూదన్‌రెడ్డి, అర్చకులు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల ముమ్మర తనిఖీ

మహదేవపూర్, డిసెంబర్ 6 : మావోయిస్టు వారోత్సవాల నేపథ్యంలో మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై ఎస్సై భవానీసేన్ సిబ్బందితో కలిసి బుధవారం ముమ్మర తనిఖీలు నిర్వహించారు. వచ్చి పోయే వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఎలాంటి ఘటనలు చోటుచేసుకోకుండా తనిఖీలు చేపట్టినట్లు ఎస్సై వెల్లడించారు. గ్రామంలో అనుమానితులు సంచరిస్తే పోలీసులకు సమాచారమివ్వాలని సూచించారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ

కాటారం, డిసెంబర్ 6 : మండల కేంద్రానికి చెందిన జాడి ధర్మయ్య బుధవారం మృతి చెందగా, ఎంపీపీ పంతకాని సమ్మయ్య ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకొని నివాళులర్పించారు. ఆయన వెంట నాయిని శ్రీనివాస్, గౌరమ్మ, ఘంట బాపు, చక్రపాణి, లక్ష్మీ దుర్గయ్య, రాజయ్య, రామయ్య తదితరులున్నారు.

మహదేవపూర్ : కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఎల్‌పీవో సుధీర్ కుమార్

మొగుళ్లపల్లి : వివరాలు తెలుసుకుంటున్న అడిషనల్ కలెక్టర్ వెంకటేశ్వర్లు

కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేసిన డీఎల్పీవో

మహదేవపూర్, డిసెంబర్ 6 : మండలంలోని బొమ్మాపూర్‌లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం డీఎల్‌పీవో సుధీర్ కుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి రైతులతో మాట్లాడారు. తుఫాన్ కారణంగా అకాల వర్షంతో ధాన్యం తడవకుండా రైతులు టార్పాలిన్ కవర్లు కప్పాలని సూచించారు. కేంద్రాల్లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని సిబ్బందిని, నిర్వాహకులను ఆదేశించారు. ఎంపీడీవో రవీంద్రనాథ్, ఎంపీవో ప్రసాద్, కార్యదర్శి రాజు తదితరులున్నారు.

ములకలపల్లిలో..

మొగుళ్లపల్లి : మండలంలోని ములకలపల్లిలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం అడిషనల్ కలెక్టర్ వెంకటేశ్వర్లు తహసీల్దార్ సునీతతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుఫాన్ నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. కొనుగోలు కేంద్రం నిర్వాహకులు రికార్డులు సక్రమంగా నిర్వహించేలా చూడాలని తహసీల్దార్‌కు సూచించారు. వారి వెంట ఆర్ఐ సురేందర్‌రెడ్డి తదితరులున్నారు.